## ఆర్మీ పిలుస్తోంది..

### వివిధ కేటగిరీల్లో నియామకాలకు దరఖాస్తులు



జగిత్యాల రూరల్, మార్చి 24: జగిత్యాల జిల్లాలోని నిరుద్యోగ యువకులకు ఆర్మీలో వివిధ కేటగిరీల్లో ఉద్యోగ నియామకాల కోసం నోటిఫికేషన్ జారీ చేశామని జిల్లా ఉపాధి కల్పన అధికారి బీ సత్తమ్మ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణతతోపాటు లైట్ మోటర్ వెహికిల్ లైసెన్స్, అగ్నివీర్ టెక్నికల్ పోస్టులకు ఇంటర్ లేదా ఐఐటీ లేదా డిప్లొమా, అగ్నివీర్ క్లర్క్, స్టోర్ కీపర్ టెక్నికల్, ట్రేడ్‌మ్యాన్ పోస్టులకు పది లేదా 8వ తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. అభ్యర్థుల వయసు 17నుంచి 21ఏండ్ల మధ్యలో ఉండాలని, ఆసక్తి ఉన్న వారు వచ్చే నెల 10లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. వివరాలకు (040-27740205) నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



బోయినపల్లి పోలీస్ స్టేషన్ ఎదుట నినదిస్తున్న ఆశ కార్యకర్తలు



జగిత్యాల: పోలీస్‌స్టేషన్ ఎదుట నినాదాలు చేస్తున్న ఆశ కార్యకర్తలు



తిమ్మాపూర్ మండలం ఎల్‌ఎండీ పోలీసు స్టేషన్‌లో ఆశ కార్యకర్తలు

హక్కుల కోసం పోరుబాట పట్టిన ఆశ కార్యకర్తలపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నది. వారం పది రోజులుగా నిరసనలు తెలుపుతున్న వారిని అరెస్ట్‌లతో అణచివేస్తున్నది. తాజాగా హైదరాబాద్ ఆరోగ్య శాఖ కమిషనరేట్ ముట్టడికి వెళ్తుండగా, ఎక్కడికక్కడ నిర్బంధించింది. మహిళలని కూడా చూడకుండా రాత్రి పూట పోలీస్ స్టేషన్లకు తరలించడంపై ఆగ్రహం వ్యక్తమవుతున్నది. తమను వెట్టి చాకిరి నుంచి విముక్తులను చేసి, ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేసినందుకే ప్రభుత్వం ఈ రకంగా కట్టడి చేస్తున్నదని ఆశ కార్యకర్తలు వాపోతున్నారు. తమను ఎంత అణచివేస్తే అంత పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరిస్తున్నారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో తమకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని, అప్పటి వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేస్తున్నారు.

# 'ఆశ'ల అణచివేత

## హక్కుల కోసం అడిగితే ఉక్కుపాదం

- నిరసన తెలిపిన ప్రతీసారి అరెస్ట్‌లు
- తాజాగా ఆరోగ్యశాఖ కమిషనరేట్ ముట్టడి నేపథ్యంలో ఎక్కడికక్కడ నిర్బంధం
- రాత్రి నుంచే అదుపులోకి.. పొద్దంతా కట్టడి
- భగ్గుమంటున్న ఆశ కార్యకర్తలు
- ఇచ్చిన హామీలు ఏమయ్యాయని నిలదీత

కరీంనగర్, మార్చి 24 (నమస్తే తెలంగాణ) : ఆరోగ్య సమాజం కోసం కృషి చేస్తున్న ఆశ కార్యకర్తలకు తగిన వేతనం ఇచ్చి గౌరవించాల్సిన ప్రభుత్వం అణచివేతకు గురి చేస్తున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పైగా హక్కుల గురించి అడిగితే ఉక్కుపాదం మోపుతున్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సెలవులు లేకుండా విధులు నిర్వర్తిస్తున్నా కనీస వేతనం రాకపోగా.. ఇచ్చే వేతనం నుంచే కటింగ్ చేస్తున్నారని ఆశ కార్యకర్తలు వాపోతున్నారు. తమకు అప్పగించిన విధులే కాకుండా ప్రభుత్వ పరమైన ఇతర సర్వేలు, వెట్టి పనులు కూడా చేయిస్తున్నారని, రావాల్సిన పెండింగ్ పారితోషకాలు కూడా ఇవ్వడం లేదని ధ్వజమెత్తుతున్నారు. 2023 సెప్టెంబర్‌లో తాము పదిహేను రోజుల పాటు చేసిన దీక్షా శిబిరాల వద్దకు కాంగ్రెస్ నాయకులు వచ్చి అనేక హామీలు ఇచ్చారని, నెలకు ₹18 వేల వేతనం ఇస్తామని, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పిస్తామని ఎన్నికల హామీల్లో పెట్టారని గుర్తు చేశారు. కానీ, ఇప్పటి వరకు ఒక్క హామీని కూడా నిలబెట్టుకోలేదని మండిపడుతున్నారు.

### ఎక్కడికక్కడ నిర్బంధం

ఆశ కార్యకర్తలు ఈ నెల 17 నుంచి వరుస ఆందోళనలు చేస్తున్నారు. మొదట తహసీల్ ఆఫీసుల ఎదుట ధర్నా చేసి వినతి పత్రాలు ఇచ్చారు. తర్వాత ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాల ఎదుట నిరసనలు తెలిపారు. జిల్లా వైద్యాధికారి కార్యాలయం, కలెక్టరేట్ ఎదుట ధర్నాలు చేశారు. ఆయా సందర్భాల్లో పోలీస్ స్టేషన్లలో నిర్బంధించారు. తాజాగా 'చలో ఆరోగ్యశాఖ కమిషనరేట్' పేరిట చేపట్టిన కార్యక్రమాన్ని సైతం పోలీసులు అణచివేసే ప్రయత్నం చేశారు. ఆదివారం రాత్రి నుంచే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆశ కార్యకర్తలను అరెస్టులు ప్రారంభించారు. మహిళలని కూడా చూడకుండా రాత్రి సమయంలో స్టేషన్లకు తీసుకెళ్లడం, గంటల తరబడి నిర్బంధించారు. సోమవారం కూడా నిఘా పెంచి ఆశ కార్యకర్తలు జిల్లా సరిహద్దులు దాటకుండా చర్యలు తీసుకున్నారు. బస్సుల్లో తనిఖీలు చేసి మరీ స్టేషన్లకు తరలించారు. ముఖ్యంగా తిమ్మాపూర్ మండలం రేణికుంట వద్ద పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించి, బస్సులు, ప్రత్యేక వాహనాల్లో హైదరాబాద్ వెళ్తున్న వారిని అడ్డుకున్నారు. అక్కడి నుంచి తిమ్మాపూర్ పోలీసు స్టేషన్‌తోపాటు కరీంనగర్‌లోని పోలీసు శిక్షణ కేంద్రానికి తరలించి పొద్దంతా నిర్బంధించారు. కమిషనరేట్‌కు వెళ్లకుండా అడ్డుకున్నారు. అయితే, రాత్రి వేళ అరెస్టులు చేసిన వారిని సొంత పూచీ కత్తుపై వదిలేసి సోమవారం ఉదయమే తిరిగి స్టేషన్‌కు రావాలనే షరతులతో వదిలేశారు. సోమవారం ఉదయం కొందరు పోలీస్ స్టేషన్‌కు స్వచ్ఛందంగా వెళ్లారు. వెళ్లని వారిని ఇంటికెళ్లి మరీ స్టేషన్లకు తరలించారు. జగిత్యాల జిల్లాలోనూ ఆదివారం అర్ధరాత్రి ముందస్తు అరెస్ట్ చేసి, సోమవారం మధ్యాహ్నం వదిలిపెట్టారు. స్టేషన్లలో నిర్బంధించిన మహిళలు ప్రభుత్వంపై, పోలీసులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు ఆశ కార్యకర్తలు మాత్రం నిఘా నుంచి తప్పించుకుని హైదరాబాద్ వెళ్లారు. అయితే, అక్కడి కమిషనరేట్ ముట్టడి సందర్భంగా లాఠీచార్జి జరిగినట్టు ఆశ కార్యకర్తల యూనియన్ నాయకులు చెబుతున్నారు.

### మాపై దౌర్జన్యమా..?



మాకు నిరసన వ్యక్తం చేసే అవకాశం కూడా ఇవ్వడం లేదు. పోలీసులు ఎక్కడికక్కడ అక్రమంగా అరెస్ట్‌లు చేస్తున్నరు. మేము అడిగేది న్యాయమైన డిమాండ్లే. మాకు ఇస్తున్న పారితోషికం ఏ మాత్రం సరిపోవడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ఇస్తున్న పారితోషికం నుంచి కటింగ్‌లు చేస్తున్నరు. ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని గతంలో మేము చేసిన రిలే నిరాహార దీక్షల వద్దకు కాంగ్రెస్ నాయకులు వచ్చి హామీ ఇచ్చిన్రు. అధికారంలోకి వచ్చిన తర్వాత తప్పక పరిష్కరిస్తామని చెప్పిన్రు. మా సమస్యలపై ఎన్నికల మేనిఫెస్టోలో కూడా పెట్టిన్రు. కానీ ఇప్పటి వరకు అమలు చేయలేదు. అందుకే తిరిగి మరోసారి వరుస ఆందోళనలు చేస్తున్నం. కానీ పోలీసులు మమ్మల్ని తీవ్రంగా అడ్డుకుంటున్నరు. కలెక్టరేట్ ముందు ధర్నాకు వెళ్లినపుడు కూడా ఇదే అరెస్టులు చేసి పోలీసు స్టేషన్లలో నిర్బంధించిన్రు. ఈ రోజు కూడా అదే విధంగా అరెస్టులు చేసిన్రు. రోడ్లపై నిఘా పెట్టి మరీ ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకుని స్టేషన్లకు తరలించిన్రు. ఇది ఎంత వరకు న్యాయం? మా న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల్సింది పోయి మాపై ఇలా దౌర్జన్యం చేయడం ఎంత వరకు సమంజసం?

**- మారెల్ల శ్రీలత, ఆశా కార్యకర్తల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి (కరీంనగర్)**



ఎల్‌ఎండీ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రాత్రి అరెస్ట్ చేసిన ఆశ కార్యకర్త

### ఉద్యమాలను ఉధృతం చేస్తం


ఆశ కార్యకర్తలు ఏండ్ల తరబడి వెట్టి చాకిరీ చేస్తున్నరు. గతంలో న్యాయం చేయాలని పోరాడినప్పుడు ₹18 వేలు ఫిక్స్‌డ్ వేతనం ఇస్తామని రేవంత్ రెడ్డి సహా పలువురు కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చిన్రు. ఇపుడు అధికారంలోకి వచ్చిన తర్వాత వీళ్లంతా మరో విధంగా ప్రవర్తిస్తున్నరు. మహిళలని కూడా చూడకుండా అర్ధరాత్రి వరకు పోలీసు స్టేషన్లలో నిర్బంధించడం ఎంత వరకు కరెక్ట్? ఆశ కార్యకర్తల ఫోన్లు, హ్యాండ్ బ్యాగులు లాక్కోవడం సరికాదు. సోమవారం తెల్లవారు జాము నుంచే గ్రామాల్లోని ఆశల ఇండ్లలోకి వెళ్లి పోలీసు స్టేషన్లకు తరలించిన్రు. ఇదెక్కడి న్యాయం? మహిళలని కూడా చూడకుండా ఇష్టమైన రీతిలో అరెస్టులు చేస్తున్నరు. ఇలాగే నిర్బంధం సాగిస్తే ఉద్యమాలను ఉధృతం చేస్తం. ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తం.



**- ఎడ్ల రమేశ్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి (కరీంనగర్)**

### ఆశ కార్యకర్తల డిమాండ్లివే

- ₹18 వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లిస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలి
- ఈఎస్ఐ, ఈపీఎఫ్ సదుపాయం కల్పించాలి
- రిటైర్డ్ బెనిఫిట్ సౌకర్యం కల్పించాలి
- ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న లెప్రసీ సర్వే బిల్లులు చెల్లించాలి
- సేవల్లో ఉండి మరణించిన వారికి ₹50 వేలు (మట్టి ఖర్చులు) అంతిమ సంస్కారాలకు చెల్లించాలి
- ₹50 లక్షలు బీమా సదుపాయం కల్పించాలి
- ఏఎన్ఎం శిక్షణ పూర్తి చేసిన ఆశలకు ఏఎన్ఎంలుగా పదోన్నతి కల్పించాలి
- కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



కోరుకంటి చందర్‌కు 'నమస్తే తెలంగాణ' కథనాన్ని బహూకరిస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ నాయకులు

## ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు

- చేతకాని పాలనలో రైతులు ఆగమైతున్నరు
- రాజకీయ కక్షతోనే కాళేశ్వరాన్ని ఎండబెట్టిన్రు
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

పెద్దపల్లి, మార్చి 24 (నమస్తే తెలంగాణ)/ గోదావరిఖని : రాష్ట్రంలో పంటలకు సాగునీరందక రైతులు అల్లాడిపోతున్నారని, ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ తెచ్చిన కరువు మాత్రమేనని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. ఇటీవల ఆరు రోజుల పాటు 'గోదావరి తల్లి కన్నీటి గోస' పేరిట 198 కిలోమీటర్ల మహా పాదయాత్ర చేసిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల బృందాన్ని సోమవారం గోదావరిఖనిలోని టీజీబీకేఎస్ కార్యాలయంలో ఆయన సన్మానించారు. పాదయాత్రపై 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనం ఫొటోను మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు అందజేశారు. కాళేశ్వరంపై కాంగ్రెస్ కుట్రలు, ఎడారిగా మారిన గోదావరి, నీరు లేక రైతులు పడుతున్న బాధలను తెలిపేందుకు కోరుకంటి చందర్ పాదయాత్ర విజయవంతంగా నిర్వహించారని మాజీ మంత్రి కొనియాడారు. కేసీఆర్ పాలనలో నిండు వేసవిలోనూ పుష్కలమైన జలాలతో రైతులు పంటలు పండించుకున్నారని గుర్తు చేశారు. కానీ, ప్రస్తుతం కాంగ్రెస్ చేతగాని పాలనతో చుక్క నీరు రాక బీటలు వారుతున్న భూములను చూసి ఆగమైపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుతో గోదావరిలో నాడు నిండుగా పారిన జలాలు నేడు ఎటుపోయాయని ప్రశ్నించారు. కేవలం రాజకీయ కక్షతోనే కావాలనే కాళేశ్వరంపై విష ప్రచారం చేసి నీటిని దిగువకు వదిలేసి గోదావరిలో చుక్కనీరు లేకుండా చేశారని ధ్వజమెత్తారు. ఎన్నో ఆశలతో సాగుచేసిన పొలాలను ఎండబెట్టి, రైతును గోసపెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఖండించారు. మేడిగడ్డ బరాజ్‌కు మరమ్మతులు చేయాలని ఎన్డీఎస్ చెప్పినా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని దుయ్యబట్టారు. గోదావరిలో నీళ్లు లేక, ఎత్తిపోతలు లేక రాష్ట్రంలో చేతికచ్చే దశంలో పంటలు ఎండిపోతున్నాయని, కొందరు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిస్థితి ఇలా ఉంటే సంబంధిత మంత్రి, ఉన్నతాధికారులు మాత్రం ఎండల తీవ్రతకు పంటలు ఎండిపోతున్నాయని, నీరు పుష్కలంగా ఉందని హేళనగా మాట్లాడడం సరికాదన్నారు. అనంతరం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ మాయ మాటలు చెప్పి అధికారం దక్కించుకున్నదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేసి నీటిని ఆపాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం తాగు, సాగు తాగునీటితో సస్యశ్యామలం అయ్యే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు కౌశిక హరి, రాకం వేణు, బొడ్డు రవీందర్, గాధం విజయ, కల్వచర్ల కృష్ణవేణి, కవిత, సరోజిని, ఆడప శ్రీనివాస్, బొబ్బలి సతీశ్ కుమార్, సట్టు శ్రీనివాస్, బుర్ర వెంకన్న, కొడి రామకృష్ణ, రామరాజు, అవునూరి వెంకటేశ్, పద్మ, వెంకటస్వామి, ఓదెలు, రాజేశ్ నాయక్ పాల్గొన్నారు.

## పీఎఫ్ ఆఫీస్ ఎదుట రిటైర్డ్ ఉద్యోగుల ధర్నా



పీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

విద్యానగర్, మార్చి 24 : రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్‌లోని పీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాకు ఈపీఎస్ 95 జాతీయ అధ్యక్షుడు కమాండర్ అశోక్ రావత్ హాజరై మాట్లాడుతూ కనీస పెన్షన్ రూ.7500తో పాటు డీఏ, మెడికల్ ఫెసిలిటీ కల్పించాలని కోరారు. ఇప్పటి వరకు రూ.వెయ్యి నుంచి రూ.2 వేల వరకే పెన్షన్ వస్తుందని, కనీస పెన్షన్‌ను పెంచేందుకు కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు. పెంచకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో రాష్ట్ర అధ్యక్షుడు శ్రీలక్ష్మి కరవధి, జిల్లా అధ్యక్షుడు వంగ వెంకటేశ్వర్లు, వర్కింగ్ ప్రెసిడెంట్ గడప కోటేశ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి తిరుమల్‌రెడ్డి, ప్రచార కార్యదర్శి మాధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



బకాయిలు చెల్లించకుంటే

## పరీక్షలు బహిష్కరిస్తాం

రిజిస్ట్రార్‌కు వినతి పత్రం ఇస్తున్న యాజమాన్యాల సంఘం నాయకులు

- శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కు యాజమాన్యాల సంఘం వినతి

కమాన్‌చౌరస్తా, మార్చి 24 : శాతవాహన యూనివర్సిటీ పరిధిలో ఉన్న ప్రైవేట్ కళాశాలలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని శాతవాహన యూనివర్సిటీ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ బాధ్యులు డిమాండ్ చేశారు. లేకుంటే రానున్న రోజుల్లో నిర్వహించే పరీక్షలు బహిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం రిజిస్ట్రార్, పరీక్షల నియంత్రణ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుప్మా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ పరీక్షల తేదీలను ప్రకటించకూడదని, ఆ తేదీలను ప్రకటించి, పరీక్షలు నిర్వహించడానికి ముందుకు వస్తే రాష్ట్ర సంఘం ఆదేశాల మేరకు ఆ పరీక్షలను బహిష్కరిస్తామని చెప్పారు. 20 నెలలుగా ప్రభుత్వం ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో చాలా యాజమాన్యాలు అనేక రకాల ఇబ్బందులకు గురవుతున్నాయని, ఆర్థికంగా చాలా నష్టపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుప్మా ప్రధాన కార్యదర్శి శ్రీపాద నరేశ్, కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి గోవిందవరం కృష్ణ, పలు విద్యాసంస్థల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.



కరీంనగర్: నగరపాలక సంస్థ కార్యాలయంలో ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తులపరిశీలన కోసం వచ్చిన దరఖాస్తుదారులు

# ఎల్‌ఆర్ఎస్.. ఏదీ క్లియరెన్స్?

- నగరపాలక సంస్థ నిర్లక్ష్యం!
- దరఖాస్తుదారుల ప్రదక్షిణలు
- సమాచారం ఇచ్చేవారు కరువు
- పట్టించుకోని అధికారగణం
- ఆఫీసులో కానరాని సిబ్బంది

*ఎల్‌ఆర్ఎస్ ఫైళ్ల క్లియర్ విషయంలో కరీంనగర్ నగరపాలక సంస్థ పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. గతంలో ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తులను క్లియర్ చేసేందుకు అధికారులు ప్రయత్నించినా దరఖాస్తుదారులు ఆసక్తి చూపించలేదు. ఇప్పుడు దరఖాస్తుదారులు క్లియరెన్స్ కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే దిక్కు లేదు. ఎల్‌ఆర్ఎస్ విషయంలో దరఖాస్తుదారులు తమకున్న సందేహాల నివృత్తి కోసం ప్రతి రోజూ పెద్ద సంఖ్యలో టౌన్ ప్లానింగ్ విభాగం వద్దకు వస్తే అక్కడ సమాచారం ఇచ్చే వారే కరువయ్యారు. అధికారులెవరు కూడా అందుబాటులో ఉండకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.*

కరీంనగర్ కార్పొరేషన్, మార్చి 24 : ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్‌ఆర్ఎస్) దరఖాస్తులను పరిష్కారంలో అలసత్వం కనిపిస్తున్నది. ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగం, బల్దియా ప్రత్యేకాధికారి ఆదేశించినా.. టౌన్ ప్లానింగ్ సిబ్బంది మాత్రం నిర్లక్ష్యం చూపుతున్నట్టు తెలుస్తున్నది. ఎల్‌ఆర్ఎస్ కోసం ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేశామని చెప్పి, కంప్యూటర్ ఆపరేటర్లను అప్పగించి చేతులు దులుపుకుంటున్నారు. దరఖాస్తుదారులు వివిధ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు కార్యాలయానికి వస్తే వాటికి సమాధానం ఇచ్చేవారు కరువయ్యారు. ఉన్న కంప్యూటర్ ఆపరేటర్లు, సిబ్బందిని అడిగితే సంబంధిత అధికారులను అడగాలని, వారు సాయంత్రం ఉంటారని చెబుతున్నారు. తీరా సాయంత్రం వస్తే అధికారులు, సిబ్బంది ఆన్‌లైన్‌లో చూసుకోవాలంటూ సమాధానాలు ఇస్తున్నారని దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు.

### పరిశీలన, ఫీజులు.. అంతా గందరగోళం

నగరపాలక సంస్థకు వచ్చిన ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తుల్లో అత్యధికంగా షాట్ ఫాల్స్ (డ్యాకుమెంట్లు సరిగా లేవు) అన్న కారణంతోనే పెండింగ్‌లో ఉన్నాయి. దరఖాస్తుదారులు డాక్యుమెంట్లు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసినా వాటిని టౌన్ ప్లానింగ్ అధికారులు సకాలంలో పరిష్కరించడం లేదన్న విమర్శలున్నాయి. దీంతోపాటు ఒకే ప్రాంతం.. ఒకే విస్తీర్ణంలో ఉన్న స్థలాలకు వేర్వేరుగా ఎల్‌ఆర్ఎస్ ఫీజులు వస్తుండడంతో దరఖాస్తుదారులు గందరగోళానికి గురవుతున్నారు. సీతారాంపూర్ ప్రాంతంలోని ఓ ఏరియాలో పక్క పక్కన ఒకే విస్తీర్ణంతో ఉన్న స్థల యజమానులు ఎల్‌ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకోగా, వారిలో ఒకరికి రూ.వేలల్లో ఫీజు రాగా.. మరొకరికి రూ.లక్షల్లో వచ్చింది. ఇదే విషయాన్ని టౌన్ ప్లానింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్తే.. సరైన సమాధానం ఇవ్వకుండా ఆన్‌లైన్‌లో వస్తే తామేం చేస్తామంటూ చేతులెత్తేశారు. ఆన్‌లైన్‌లోనూ అనునిత్యం ఏవో సమస్యలు వస్తూనే ఉన్నాయి. వీటిపై అటు ప్రభుత్వం, ఇటు అధికారులు కూడా దృష్టి పెట్టకపోవడంతో ఈ పథకమే గందరగోళంగా మారింది.

### దరఖాస్తుదారుల్లో ఆందోళన

ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తుల క్లియరెన్స్ లేకపోవడంపై దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల్లో పది రోజుల్లో ప్రొసీడింగ్స్ ఇస్తామని చెప్పినా.. ఇవ్వడం లేదని మండిపడుతున్నారు. ఎప్పుడు క్లియర్ చేస్తారో తెలియక ఆఫీసు చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ఉన్నతాధికారులెవరూ పట్టించుకోవడం లేదని, టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. ఈ విభాగంలోని అధికారులు, సిబ్బంది సాయంత్రమైతే తప్ప కార్యాలయం వైపు చూడడం లేదని ఆరోపిస్తున్నారు. ఫీజు కట్టి క్లియరెన్స్ కోసం ఎన్ని రోజులు ఎదురుచూడాలని ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ పాలన అంటేనే ఇలా ఉంటుందని, ఒక్క పని కూడా సక్రమంగా పూర్తి కాదని ఆగ్రహిస్తున్నారు.